www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 27 సెప్టెంబరు 2023

5

పశ్చిమ గోదావరి

ఎక్కువ ఓటర్లు ఉన్న ఇంటిని పున:పరిశీలించాలి

ప్రజాశక్తి - భీమవరం

పదిమంది ఓటర్లు దాటిన ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో పున:పరిశీలించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. నరసయ్య అగ్రహారం, బ్యాంకు కాలనీలో పది మంది ఓటర్లుకు మించి ఉన్న గృహాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారందరూ ఆ ఇంట్లోనే నివాసం ఉంటున్నారా, వేరే ప్రాంతంలో ఉంటు న్నారా అని ఆరా తీశారు. దీనికి సంబంధించిన వివరాలను, ఇంటి డోర్ నెంబర్లను కంప్యూటర్‌లో నమోదు చేశారా అని బిఎల్ఒలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రెండు కిలోమీటర్ల పరిధిలోపు పోలింగ్‌స్టేషన్‌ను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. చేర్పులు, మార్పులు, డెత్‌లు, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించడంతో పాటు, స్థానిక ప్రజల విజ్ఞాపనలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ వై.రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ విజ్ఞాపతి, బిఎల్ఒలు ఉన్నారు.

కదంతొక్కిన విద్యార్థులు

నినాదాలతో హోరెత్తిన కలెక్టరేట్

పోలీసులకు, ఎస్ఎఫ్ఐ నేతలకు మధ్య తీవ్ర వాగ్వివాదం

పోలీసుల దూషణలతో తీవ్ర ఉద్రిక్తత, తోపులాట

కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేత

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థుల నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుండి మంగళవారం విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అప్పటికే విద్యార్థులను అడ్డుకునేందుకు వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు కలెక్టరేట్ సమీపంలోని తిరుమల కాలేజీ వద్ద తమ సిబ్బందితో మాటువేసి అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు తిరుమల కాలేజీ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎండలో విద్యార్థులు బైఠాయించి ఆందోళన చేపట్టడంతో సమస్యను చెప్పుకోవడానికి పది మందిని అనుమతిస్తామని సిఐ ప్రతిపాదించగా విద్యార్థులు అందుకు నిరాకరించారు. తామంతా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని, శాంతియుతంగానే కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. దీనికి పోలీసులు అంగీకరించకపోవడంతో విద్యార్థులు కలెక్టరేట్ వైపు దూసుకెళ్లారు. దీంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొందరు పోలీసులు విద్యార్థి నాయకులను దొంగలంటూ దూషించడంతో ఉద్రిక్తతలు

విద్యార్థినేతలతో ఎస్ఐ వాగ్వివాదం

ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆయా విద్యార్థుల కళాశాలలకు ఫోన్ చేసి మీ విద్యార్థులను ధర్నాకు ఎందుకు పంపారు. వీళ్లపై కేసులు పెడితే పరిస్థితి ఏమిటంటూ బెదిరింపుల పర్వానికి దిగారు. దీనిపై ఎస్ఎఫ్ఐ నేతలు పోలీసుల తీరును ఖండించారు. ఈ నేపథ్యంలో సిఐ జోక్యం చేసుకుని విద్యార్థులకు సర్దిచెప్పి కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు అనుమతించారు.

గత జులై పదో తేదీ నుండి 20వ తేదీ వరకు సుమారు 300 కిలోమీటర్లు విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ద్వారా ఎస్ఎఫ్ఐ నాయకులు తెలుసుకున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ నేతలు విమర్శించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు డిమాండ్ చేశారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తుంటే ఎస్ఐ వెంకటేశ్వరరావు విద్యార్థులను, విద్యార్థి నాయకులను దొంగలు అంటూ దూషించడం తగదని, తక్షణం క్షమాపణలు చెప్పాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్.డి.జాన్, నేతలు బి.గణేష్, కుమార్, కె.లక్ష్మణ్, శాంతి, యశ్వంత్, కె.ఈశ్వర్, పి.నాగేంద్రబాబు, సింధు, భవ్య, చిరంజీవి, శేఖర్, నివాస్, నాని సంతోష్, మురళీకృష్ణ, హర్ష పాల్గొన్నారు.

బిల్లులే షాక్...!

ఇష్టానుసారంగా విద్యుత్ ఛార్జీలు పెంపు

సర్దుబాటు, ట్రూఅప్, సర్‌ఛార్జీ పేరుతో బాదుడు

భారాలతో తల్లడిల్లుతున్న సామాన్య ప్రజానీకం

నేడు వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజానీకంపై మోయలేని విద్యుత్ భారాన్ని మోపాయి. సర్దుబాటు, ట్రూఅప్ సర్‌ఛార్జీల పేరుతో ఇష్టానుసారంగా అదనపు ఛార్జీలు వసూలు చేస్తూ పేదల నడ్డి విరుస్తున్నాయి. ఇది చాలదన్నట్టు గతంలో వినియోగించిన విద్యుత్‌కు సైతం ఇప్పుడు ఛార్జీలు మోపి గుంజుతున్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో సామాన్య ప్రజానీకం, రైతులు, సన్న, చిన్న, కుటీర పరిశ్రమలు మూతపడి అనేక సమస్యల మధ్య సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ భారాలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

జిల్లా ప్రజలకు విద్యుత్ సర్దుబాటు పోటు పడింది. ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మరింత భారాన్ని మోపింది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజానీకం విద్యుత్ భారాలు మోయలేక సతమతమవుతున్నారు. కుటీర, చిన్న పరిశ్రమలతోపాటు ఎలక్ట్రికల్, జ్యూస్, వివిధ రంగాల షాపుల యాజమాన్యాలు, కార్మికులు, గృహ వినియోగదారులు చెప్పుకుంటూ పోతే పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా అందరిపై సర్దుబాటు ఛార్జీల భారం మోపుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కరెంటు ఛార్జీలను భారీగా పెంచేసింది. యూనిట్‌కు సగటున మూడు దశలుగా 83 పైసల చొప్పున పెంచి, 36 నెలలు వసూలు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని నివాసగృహాలు మొదలుకుని వ్యవసాయ. కమర్షియల్, ఇండస్ట్రియల్, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ సర్వీసుల వరకూ విద్యుత్ కనెక్షన్లన్నింటికీ కరెంటు ఛార్జీలను పెంచింది. ఆరు కేటగిరీలుగా విద్యుత్ కనెక్షన్లు విభజించారు. వీటిన్నింటి పరిధిలోని కనెక్షన్లన్నింటికీ ట్రూఅప్ ఛార్జీల పెంపును వర్తింపజేసింది. ప్రభుత్వానికి పేద, ధనికులనే తేడాలేకుండా ట్రూఆప్ ఛార్జీలు బాదేయడం విస్మయానికి గురిచేస్తోంది. 2014 నుండి 2019 మధ్య వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూఅప్ ఛార్జీలను పెంచింది. దీనిలో భాగంగా వినియోగించిన విద్యుత్‌పై యూనిట్ రూ.7 పైసలు చొప్పున ట్రూఅప్ ఛార్జీలు మోపి వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఒక గృహానికి 300 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే వారికి సరాసరి రూ.27 ట్రూఅప్ పేరుతో వసూలు చేస్తున్నారు. గతంలో కరెంటు ఛార్జీల పెంపుదలను పరిశీలిస్తే క్లబ్ రేట్ల ప్రకారం పెంచడం తెలిసిందే. దీన్నిబట్టి గమనిస్తే పేదల విద్యుత్ వినియోగం పరిమితం. దీన్నిబట్టి పేదలపై భారం పరిమితంగానే ఉండేది. తాజా ట్రూఅప్ ఛార్జీల విషయంలో పేద, ధనిక కనెక్షన్లనే తారతమ్యం లేకుండా ఛార్జీలు పెంచేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ ఛార్జీలు, ఫిక్స్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు ఇలా అనేక ఛార్జీలు మోపి వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై రుద్దుతున్నారు. దీంతో విద్యుత్ భారాన్ని మోయలేక సామాన్య ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతినెలా వేలకు వేలు బిల్లులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. ఆక్వా రైతులు కూడా విద్యుత్ భారాలు భరించలేక క్రాప్ హాలిడే ప్రకటించే ఆలోచనలో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.1.50 పైసలు సబ్సిడీ ఆక్వా జోన్ కు మాత్రమే పరిమితం కావడంతో నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉన్న ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకపక్క ఫీడ్, సీడ్ ధరలు అధికంగా ఉండడం, మరోపక్క రకరకాల వైరస్‌లు రావడం, దీనికి తోడు ధర నిలకడగా లేకపోవడం వంటి సమస్యలతో ఆక్వా రైతులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజానీకం, పరిశ్రమల యజమానులు, ఆక్వా, వ్యవసాయ రైతులకు వామపక్షాలు అండగా నిలిచాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యుత్ వ్యతిరేక విధానాలను ఎండగట్టే దిశగా భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించేందుకు వామపక్షాలు పిలుపునిచ్చాయి.

నేటి ధర్నాలో భాగస్వాములు కండి

ప్రభుత్వం దారుణంగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అదనపు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని భీమవరం కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శులు బి.బలరాం, కోనాల భీమారావు, లంక కృష్ణమూర్తి, రొంగల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలతో జనం సతమతమౌతూ మరోవైపు విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు విద్యుత్ చట్టంలో మార్పులు, ఛార్జీల పెంపు ద్వారా ప్రజలపై వేల కోట్ల భారాన్ని వేస్తున్నాయని విమర్శించారు. పెంచిన ఛార్జీలను, సర్‌ఛార్జీ, ఫిక్స్‌డ్ ఛార్జీ, ట్రూఅప్‌ఛార్జీ, ఇంధన సర్దుబాటు ఛార్జీ వంటి అదనపు భారాల ఛార్జీలను తక్షణం రద్దు చేయాలని ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. భారమైన విద్యుత్ ఛార్జీలను ప్రజలు వ్యతిరేకించాలని, కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని నిరసనలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర వెయ్యి కాయలకు రూ.15 వేలు ఇవ్వాలని, కొబ్బరి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ఎకరం కొబ్బరి తోటకు రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుందని, ఒకప్పుడు నెలకు ఒక దింపు దిగడంతో ఆదాయం బాగుండేదని, రాను రాను మూడు నెలలకు దింపు దిగడంతో ఎకరంలో ఉన్న 70 చెట్లకు వెయ్యి కాయలకు మించి దిగుబడి రావటం లేదన్నారు. వెయ్యి కాయలకు రూ.మూడు వేలు మాత్రమే ఆదాయం వస్తుందని, సంవత్సరానికి రూ.12 వేలు మాత్రమే రావడంతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల కొబ్బరి రైతులు తీవ్ర సంక్షోభంలో పడ్డారన్నారు. జిల్లాలో నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. తొలుత స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో కొబ్బరి రైతుల సదస్సు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కన్వీనర్‌గా తూటే మార్టిన్ లూథర్, కో-కన్వీనర్‌గా కడలి నాగరాజు, మరో 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గుత్తుల శ్రీరామచంద్రుడు, కొప్పుశెట్టి సత్యనారాయణ, కుంచే రామచంద్రరావు, అయినంపూడి బాబూరావు, దొంగ భాస్కరరావు, మైలా జనార్దన్‌రావు, కడలి నాగరాజు, మల్లుల శ్రీరాములు, కె.నాగరాజు, మైగాపుల త్రిమూర్తులు, దొంగ భాస్కరరావు, పిల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కొబ్బరి రైతులు

ఆదర్శప్రాయులు చిలకమర్తి లక్ష్మీనరసింహం

జయంతి వేడుకలో వక్తలు

ప్రజాశక్తి - వీరవాసరం

చిలకమర్తి లక్ష్మీనరసింహం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. జాతీయ కవి, కళాప్రపూర్ణ, స్వాతంత్ర్య సమరయోధుడు కీర్తిశేషులు చిలకమర్తి లక్ష్మీనరసింహం 156వ జయంతిని వీరవాసరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం అధ్యక్షులు గుండా రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ జయంతి వేడుకలను నిర్వహించారు. తూర్పుచెరువు గట్టుపై ఉన్న చిలకమర్తి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చిలకమర్తి జీవిత చరిత్రను, ఔన్నత్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా కెజిఆర్ రిటైర్డ్ ప్రిన్సిపల్ దాయన చంద్రాజీ, ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, సంస్కృత ఉపాధ్యాయుడు చిలుకూరి ఫణికుమార్, తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు, కుసుమే ఆనందరావులను కళాపరిషత్ తరపున చిలకమర్తి పురస్కారంతో సత్కరించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంచారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, చిలకమర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, జవ్వాది దాశరధి శ్రీనివాస్, గోదాసి రాంబాబు పాల్గొన్నారు. వీరవాసరం గ్రంథాలయంలో ఉన్న చిలకమర్తి విగ్రహానికి గ్రంథ పాలకుడు బి.హనుమంతరావు ఆధ్వర్యంలో, ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిలకమరి లక్ష్మీనరసింహం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

చిలకమర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

ఎబిఎస్‌వికెలో ఉచిత గుండె వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌వర్మ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పెద్దల, పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం నిర్వహించారు. పెద్దలకు స్థానిక తేజ హాస్పిటల్ అధినేత డాక్టర్ పొనమండ చంద్రశేఖర వర్మ ఇసిజి ఇసిజి ఎకో పరీక్షలు చేసి వైద్యసేవలందించారు. పిల్లలకు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పరీక్షలు చేసి వైద్య సేవలందించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఎబిఎస్‌వికె వైద్య సహాయ కేంద్రానికి సహకారం అందిస్తున్న వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు, కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, డెక్కన్ ఫైన్ కెమికల్ లిమిటెడ్ సంస్థ అధినేతలు జిఎస్.రాజు, పద్మ దంపతులు, ఎస్ఐజి హాస్పిటల్స్ (హైదరాబాద్) అధినేత దండు శివరామరాజు, అల్లూరి ట్రస్టీ బి.బలరాం, వైద్య సేవలందించిన డాక్టర్ విక్రమ్, చంద్రశేఖర్ వర్మలను అభినందించారు. ఎస్ఎల్‌జి హాస్పిటల్స్ ప్రతినిధి రణదివే పాల్గొన్నారు.

డ్రోన్ పైలెట్ శిక్షణను యువత వినియోగించుకోండి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కూలీల కొరత, సాగు ఖర్చులు తగ్గించడానికి మన విశ్వ విద్యాలయం డ్రోన్ పైలెట్ శిక్షణ నిర్వహిస్తుందని, దీనిని గ్రామీణ యువత పూర్తిస్థాయిలో వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసా య విశ్వ విద్యాలయ ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి, పరిశోధనా సంచాలకులు (డైరె క్టర్ ఆఫ్ రీసెర్చ్) డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. మంగళ వా రం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని వారు సంద ర్శించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ప్రాంతీ య వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి గతేడాది 135 నుంచి 140 రోజుల కాల పరిమితి కలిగి, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లో సాగు కోసం ఎంటి యు రైస్ 1310, ఎంటియు రైస్ 1321 రకాలను రూపొందించామని తెలిపారు. ఈ ఏడాది ఈ రకాలపై జోన్‌లో ఉన్న అన్ని విస్తరణ కేంద్రాల్లో క్షేత్ర పరిశీలనలు నిర్వ హిస్తున్నామని తెలిపారు. ప్రత్తి పరిశోధన, విస్తరణ కేంద్రా లలో శాస్త్రవేత్తల కొరత ఉందని, ప్రతి విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో శాస్త్రవేత్తలను నియమిస్తామని తెలిపారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత మూడేళ్లలో రూ.133 కోట్ల విలువైన పనులను చేపట్టామని తెలిపారు. నాబార్డ్, ఆర్‌కెవివై, డిఎస్‌టి, డిబిటి వంటి సంస్థలకు కూడా ప్రాజెక్ట్ ప్రపోజల్స్ పంపుతున్నామని, దీని ద్వారా కూడా కొన్ని చోట్ల మౌలిక వసతుల కల్పన జరిగే అవకాశం ఉందని తెలిపారు. పరిశోధనా సంస్థలో పనిచేస్తున్నవారి సమస్య లను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ అసోసి యేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి, శాస్త్రవేత్త లు, భోధనేతర సిబ్బంది, పాలిటెక్నిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ రంగాల అభివృద్ధికి రుణాలివ్వాలి

బ్యాంకర్ల సమావేశంలో జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ రంగాలకు విరివిగా రుణాలను మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి బ్యాంకర్లను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశం జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూ.20,220 కోట్ల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. బ్యాంకర్లు రుణాల మంజూరులో తమవంతు సహకారం అందించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రాధాన్యతరంగాలకు రూ.17,705 కోట్లు రుణాలు లక్ష్యంగా నిర్ణయించగా వాటిలో తక్కువ కాలవ్యవధి వ్యవసాయ రుణాలకు రూ.7,080 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.4,094 కోట్లు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితరాలకు రూ.1,372 కోట్లు, ఎగుమతులతో కలిపి ఎంఎస్ఎంఇకి రూ.4,314 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ.2,615 కోట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రాధాన్యేతర రంగాలకు రూ.2,515 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రుణాల మంజూరు లక్ష్య సాధనలో జూన్ నెలాఖరు నాటికి వివిధ వ్యవసాయ రుణాల మంజూరు లక్ష్యం రూ.12,546 కోట్లు కాగా 32.68 శాతం, ఎంఎస్ఎం ఎగుమతుల రుణాలు రూ.4,314 కోట్లు లక్ష్యమవ్వగా 46.95 శాతం లక్ష్యసాధన, ఇతర ప్రాధాన్యతా రంగాలైన విద్య, గృహ, ఇతర రుణాలకు సంబంధించి రూ.845 కోట్లు లక్ష్యమవ్వగా 12.08 శాతం, ప్రాధాన్యేతర రంగాలకు రూ.2,515 కోట్లు లక్ష్యంగా 56.91 శాతం లక్ష్యసాధన జరిగినట్లు వివరించారు. టిడ్కో రుణాలు ఇప్పటివరకు 10,266 మంది లబ్ధిదారులకు మంజూరు చేశామని, మిగిలిన 940 మందికి రుణాలను మంజూరు చేసి నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. సిసిఆర్‌సి కార్డులు విరివిగా జారీ చేసి కౌలురైతులకు రుణాల మంజూరుకు బ్యాంకర్ల సహకరించాలన్నారు. పిఎంఇజిపి పథకం కింద 65 టార్గెట్ కాగా నూరు శాతం లక్ష్యసాధన జరిగిందని, ఇంకా 40 దరఖాస్తుదారులకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకున్నారు. పిఎం విశ్వకర్మ యోజన పథకంలో పశ్చిమగోదావరి పైలెట్ ప్రాజెక్టుగా ఉందని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించి సంప్రదాయ వృత్తుల వారికి రుణాలను మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం స్వనిధి పథకం కింద 9,063 దరఖాస్తులు అందగా 7,215 మందికి రుణాలను మంజూరు చేశారన్నారు. జగనన్న తోడు ఏడో విడత లక్ష్యం 12,343 దరఖాస్తులు లక్ష్యమవ్వగా 12,438 మంది దరఖాస్తుదారులకు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం 2023-24 వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, యుబిఐ రీజనల్ హెడ్ పి.సంగీతకుమారి, ఆర్‌బిఐ ఎల్‌డిఒ పూర్ణిమ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకుల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రుణ ప్రణాళికను విడుదల చేసిన జెసి రామ్‌సుందర్‌రెడ్డి

కొల్లేరు రోడ్డు నిర్మాణానికి చర్యలు

ఆక్రమణల తొలగింపునకు సిద్ధం

ప్రాంతాలను పరిశీలించిన ఆర్‌డిఒ దాసిరాజు

ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

కొల్లేరుకు రోడ్డు నిర్మిస్తున్నారు. ఉండి మండలంలోని పాములపర్రు నుంచి ఆకివీడు మండలం పెదకాపవరం మీదుగా కొల్లేరు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డును రూ.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. పెదకాపవరం గ్రామం మీదుగా కొల్లేరు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా గ్రామంలో నివాస గృహాలు ఉన్న మేర మొత్తం ఆక్రమణలు ఉన్నట్లుగా అధికారులు తేల్చారు. ఈ ఆక్రమణలు తొలగించేందుకు గత వారం రోజులుగా అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సర్వే వివరాలను, పెదకాపవరంలో ఆక్రమణలు తొలగించే ప్రాంతాలను ఆర్‌డిఒ దాసిరాజు మంగళవారం పరిశీలించారు. అందుకు అవసరమైన సూచనలను, సలహాలను ఆయన రోడ్లు భవనాల శాఖ అధికారులకు, తహశీల్దార్ విజయలక్ష్మికి అందించారు. నాలుగున్నర కిలోమీటర్ల బిటి రోడ్డు, రెండున్నర కిలోమీటర్ల సిమెంట్ రోడ్డు మొత్తం ఏడు కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్అండ్‌బి ఎఇ శ్రీహరిరాజు తెలిపారు. ఇప్పటివరకు రోడ్డు మొత్తం మూడున్నర మీటర్లు వెడల్పు ఉండగా ఇప్పుడు ఆ రోడ్డు రెట్టింపు చేస్తున్నట్లు తెలిపారు. ఏడు మీటర్ల రోడ్డు అదనంగా రెండు పక్కల ఒక్కొక్క మీటర్ చొప్పున మార్జిన్ కలిపి మొత్తం తొమ్మిది మీటర్ల రోడ్డు ఏర్పడుతుందని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా పంట కాలువలు ఉన్నాయని, మిగిలిన మొత్తం ఆర్అండ్‌బి రోడ్డు అని వారు తెలిపారు. ఆర్అండ్‌బి రోడ్డులోనే పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు జరిగాయని, రోడ్డు అవసరం మేరకు మాత్రమే మెట్లు, ప్రహరి గోడలు వంటివి మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు. అవసరమైన మూడు, నాలుగు చోట్ల ప్రత్యామ్నాయన్ని చూపి తొలగించాల్సి ఉందని ఆర్‌డిఒ తెలిపారు.

పిడుగుపాటుతో పెనువిషాదం

వరుసకు తల్లీకూతుళ్లు దుర్మరణం

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

పిడుగుపాటుకు పేద కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. లింగపాలెం మండలం పాశ్చానగరం తుమ్మంద్రుగూడెంలో మంగళవారం పిడుగుపడి వరుసకు తల్లీ కూతుళ్లయ్యే ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఈ విషాదకర ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుమ్మంద్రుగూడెంలో మంగళవారం సొంగా దేవమాత (50), సొంగా మనీషా (20), సొంగా జ్యోత్స్న పొలంలో పనికి వెళ్లారు. ఆ సమయంలో వర్షం రావడంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నారు. అయితే కొద్దిసేపటికే ఆ చెట్టుపై పిడుగుపడి వారంతా కుప్పకూలిపోయారు. దీన్ని గమనించిన స్థానికులు హుటాహుటీన వారిని 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా దేవమాత, మనీషా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. జ్యోత్స్న పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై చింతలపూడి ప్రభుత్వాసుపత్రి వైద్యులు నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా పిడుగుపాటుకు గురైన ముగ్గురు మహిళలను 108లో తీసుకొచ్చారన్నారు. ఇద్దరు అప్పటికే మృతి చెం దారని, మరొకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

దేవమాత / మనీష

భోరున విలపించిన కుటుంబ సభ్యులు

ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు మృత్యువాత పడటంతో బంధువులు భోరున విలపించారు. మృతదేహాలను చూసేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి : ఎంఎల్ఎ

పిడుగుపాటుకు గురై మృతి చెందిన మహిళల కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఎంఎల్ఎ ఎలిజా కోరారు. సంఘటన విషయం తెలియగానే బాధిత కుటుంబ సభ్యులతో ఎలిజా మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆపై కలెక్టర్‌కు ఫోన్ చేసి బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - యలమంచిలి

విద్యుత్ ఛార్జీలు, పెరిగిన నిత్యావసరాల ధరలకు నిరసనగా ఈ నెల 27వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలంతా జయప్రదం చేయాలని సిపిఎం మండల కమిటీ పిలుపునిచ్చింది. మండలంలోని చించినాడ గ్రామంలోని అమరవీరుల స్మారక భవనంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం సీనియర్ నాయకులు దేవ సుధాకర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బాలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టిన అనంతరం విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలు దిగి రావాలంటే పోరాటమే శరణ్యమని, దీనిలో భాగంగానే ఈ ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఆంజనేయులు, వడ్డీ కాసులు, స్టాలిన్ పాల్గొన్నారు.

సీసలిలో ప్రభాతభేరి ర్యాలీ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని సీసలి గ్రామంలో మండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నా భూమి - నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. నా భూమి - నా దేశంలో భాగంగా ప్రభాతభేరి ర్యాలీ నిర్వహించారు. ఆనందోత్సాహాలతో, మేళ తాళాలతో పాఠశాల విద్యార్థుల చేతిలో జాతీయ జెండాలతో, జాతీయ నాయకుల చిత్రపటాలతో ప్రదర్శన చేశారు. ప్లకార్డులు పట్టుకుని ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై, బోలో స్వతంత్ర భారత్ కీ జై వంటి నినాదాలతో ర్యాలీ చేశారు. ప్రత్యేకంగా తయారుచేసిన కలశంలో మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి, ఎన్.విజయలక్ష్మి, సిఆర్‌పి బి.ప్రకాష్‌బాబు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికులపై నిర్బంధకాండ సిగ్గుచేటు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న ఉద్యోగ, కార్మికులపై నిర్బంధకాండను ప్రయోగించడం సిగ్గుచేటని ఎఐటియుసి ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు అన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల చలో విజయవాడ కార్యక్రమంపై పోలీసుల నిర్బంధకాండను ఖండిస్తూ మంగళవారం ఎఐటియుసి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో కార్మికులు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల సృజనవాటిక ప్రాంతంలో చెరువుగట్టుపై విస్తారంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావంతో మహాత్మ గాంధీ ఆశయాల స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య, సహాయ కో-ఆర్డినేటర్ కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించాలని ఎఐసిటిఇ సూచించిందని, అందులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సృజన వాటిక వద్ద ర్యాలీ నిర్వహించారు.

గణపవరంలో ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గణపవరం-2,3 సచివాలయాల వద్ద ఆరోగ్య సర్వే నిర్వహించినట్లు వైద్యులు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ కుటుంబ సంక్షేమం ఆరోగ్య భరోసా కల్పించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో వాలంటీర్లు, ఎఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలు గుర్తిస్తారని చెప్పారు. ఆరోగ్య పరమైన సమస్యలు ఉంటే వారికోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రులకు సిఫార్సు చేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రి నుంచి ఒక స్పెషలిస్టు డాక్టర్ ఈ శిబిరంలో పాల్గొంటారన్నారు. ఈ నెల 30వ తేదీన గణపవరం-2 సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు సిహెచ్.పద్మజ, ఆరోగ్య సహాయకులు ఎ.కృష్ణ, జి.శ్రీనివాస్, ఎం.నల్లయ్య పాల్గొన్నారు.

ఎన్‌సిసి శిక్షణకు శశి కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శారీరిక, రాతపరీక్ష, భౌతిక పరీక్షలు నిర్వహించి ఎన్‌సిసి శిక్షణకు ఎంపిక చేసినట్లు ఆంధ్ర బెటాలియన్ నాయబ్ సుబేదార్ దేవేందర్ సింగ్, కుల్విందర్ సింగ్ తెలిపారు. ఈ ఎంపిక పరీక్షలు కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ పిఎస్.శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరడం వల్ల సేవాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐకమత్య భావన, దేశభక్తి కలుగుతుందన్నారు. ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎండి ఇస్మాయిల్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఆరోగ్య సురక్ష పైలెట్ క్యాంపు పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని మహాదేవపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ క్యాంపును రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, అడిషనల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భానునాయక్, డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుగుణరాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ సింధీ ఆనంద్, పీడియాట్రిషన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఉండి పిహెచ్‌సి వైద్యులు బి.సాయిచంద్ర, ఎండగండి పిహెచ్‌సి వైద్యులు బిన్నీ శామ్యూల్, సిహెచ్‌ఒ రత్నరాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యకు ప్రోత్సాహం అందించడం లయన్స్ బాధ్యత అని జోన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. స్థానిక 35వ వార్డు మున్సిపల్ స్కూల్‌లో తాడేపల్లిగూడెం డైమండ్స్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన సకూరు ఎల్లోజీరావు సౌజన్యంతో స్కూల్ విద్యార్థులకు భోజనం కంచాలు, స్నాక్స్, పెన్సిల్ బాక్సులు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా పేరిచెర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు సూచనలు మేరకు డైమండ్స్ లయన్స్ సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మద్దుకూరి మెహర్‌ప్రసాద్, జయకుమార్, సత్యనారాయణరాజు, డాక్టర్ కమల, సుశీల పాల్గొన్నారు.

అవినీతిలో వైసిపి ముందంజ : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అధికారం కోసం మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజలరను అంధకారంలోకి నెట్టేశాడని, అవినీతిలో వైసిపి ప్రభుత్వం ముందుందని జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రెండో రోజు మంగళవారం పడాలలో పల్లెపోరు నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ప్రజల తరపున బలంగా పోరాడాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జనసేనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

విద్యుత్ సంస్కరణల పేరుతో దోపిడీ

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యుత్ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై తీవ్రమైన భారాలను మోపుతూ దోపిడీకి పాల్పడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. మార్టేరు దేవాంగ కళ్యాణ మండపంలో ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌విఎన్.శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్, సెస్, సర్దుబాటు ఛార్జీల పేర్లతో పెద్దఎత్తున విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతుందన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.400 కోట్లకు పైగా విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఒకేసారి ప్రజలకు భారం కాకుండా కొన్ని నెలల విరామం ఇచ్చి సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు మోపి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగిస్తామని మోటార్లకు మీటర్లు బిగించి భారాలు మోపడానికి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేయడానికి వస్తున్నవారిని జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించడాన్ని సిపియం జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని బలరాం తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ ఖరీఫ్ పంట మరికొన్నిరోజుల్లో కోతకు రానుందని, రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ధాన్యం కేటాయింపులకు తగినన్ని గోనె సంచులను ముందుగానే ఆర్‌బికెలకు సమకూర్చేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు మండలాల కార్యదర్శులు కూసంపూడి సుబ్బరాజు, సూర్నీడి వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్, నాయకులు వద్దిపర్తి అంజిబాబు, పి.మోహనరావు, కేతా పద్మజ, నేదూరి హనుమంతరావు, రాపాక ఆశీర్వాదం, షేక్ పాదుషా, బొంతు శ్రీను, నీలాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం భీమవరం కోర్టు బయట న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్.రంగారావు, కార్యదర్శి పాకా రమేష్ మాట్లాడుతూ ఆల్ ఇండియా న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలని, జీవిత భీమా మరణానంతరం రూ.12 లక్షలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఎపిపి, పిపి, ఎజిపి పోస్టులు భర్తీ చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వెల్ఫేర్ ఫండ్ రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వైవి.ఆనంద్, పి.రాఘవేంద్రరావు, నాగబాబు, వై.న్యూటన్, సుబ్బారావు, వీరవల్లి శ్రీను, బాబి పాల్గొన్నారు.

ఏడుకొండలుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం వైఎన్.కళాశాల నాన్-టీచింగ్ విభాగంలో 42 ఏళ్లుగా పని చేస్తున్న కళాశాల సూపరింటెండెంట్ ఏడుకొండలును ఆలిండియా కాలేజీ, యూనివర్సిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్‌గా నియమించారు. ఎపిఎసిఎన్‌టిఎస్ అసోసియేషన్ నుంచి ఐదుగురిని ఈ ఫెడరేషన్‌కు నియమించినట్లు ఎం.జహీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఏడుకొండలును వైఎన్.కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు, కళాశాల ప్రిన్సిపల్ ఎపివి.అప్పారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ చింతపల్లి కనకారావు, బెజవాడ వెంకటరత్నం, పీజీ కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.చింతారావు, ఎంబిఎ హెడ్ డాక్టర్ ఆర్.పార్థసారధి, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ అభినందించారు.

సిపిఎం నవుడూరు శాఖ కార్యదర్శిగా బాబూరావు

ప్రజాశక్తి - వీరవాసరం

అయినపూడి బాబూరావు

సిపిఎం నవుడూరు శాఖ కార్యదర్శిగా అయినపూడి బాబూరావును గ్రామ శాఖా సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మేరకు శాఖ సమావేశాన్ని లింగం సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఇప్పటివరకు శాఖ కార్యదర్శిగా ఉన్న మారియ్యనాయుడు కుటుంబ ఇబ్బందుల రీత్యా బాధ్యతల నుంచి తొలిగారు. శాఖ సమావేవంలో సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజా ఉద్యమంపై ప్రభుత్వం దమనకాండ ఆపకపోతే భవిష్యత్తులో నష్టపోయేది ప్రభుత్వామేనన్నారు. పాదయాత్రలో జగన్ చేసిన వాగ్దానాలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు చేపట్టిన ఉద్యమాలపై పోలీసులతో నిర్బంధం ప్రయోగించడం, అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ నాలుగేళ్లలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు, ఐదు సార్లు బస్సు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. చెరువులను తలపించే విధంగా రహదారులు దర్శనమిస్తుంటే మరమ్మతులు కూడా చేయకపోవడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రజా సమస్యలపై గ్రామాల్లో పర్యటించి ప్రజలను సమీకరించి ఆందోళనకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యాళ్లబండి మారియ్యనాయుడు, తాళ్లూరి రాము, యాళ్లబండి నారాయణమూర్తి, మైగాపుల త్రిమూర్తులు పాల్గొన్నారు.

29న మహాధర్నాకు దళితులంతా తరలిరావాలి

కెవిపిఎస్, వ్యకాస జిల్లా కార్యదర్శులు క్రాంతిబాబు, సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 29వ తేదీన విజయవాడలో జరగనున్న మహా ధర్నాకు దళితులందరూ తరలిరావాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బాతిరెడ్డి జార్జి, బత్తుల విజయకుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం, సంక్షేమం, ఉపాధి, దళితపేటల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సమానత్వం, సామాజిక న్యాయమే ధ్యేయంగా చేపట్టిన దళిత రక్షణ యాత్ర ముగిసిందన్నారు. నాలుగు రోజుల పాటు సాగిన యాత్ర జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, ఆరు పట్టణాల మీదుగా దళితపేటల సమస్యల ఎజెండాగా సాగిందని తెలిపారు. శ్మశాన వాటికలు లేని దళిత పేటలు వందల సంఖ్యలో ఉన్నాయన్నారు. దళితుల భూములు, స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితులకు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, సబ్ ప్లాన్ చట్టాలను నిర్వీర్యం చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఉన్న సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసే బిజెపిని గద్దె దించాలన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 29న విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న మహాధర్నాకు దళితులందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు అన్నదానం

పాలకొల్లు :పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద 1009వ రోజు టిడిపి రాష్ట్ర తెలుగు రైతు కమిటీ ఉపాధ్యక్షులు బోనం వెంకట నరసింహరావు (నాని) పేదల కోసం మంగళవారం ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయనకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

CHANGE OF NAME

I, MUNGARA SUDHA BHARATHI D/o. Mungara Thimothi, Residing at H. No. 4-18, Paidichintapadu village, Eluru M.D, Eluru Dist. Have changed my name From **MUNGARA SUDHA BHARATI** (Old name) to **MUNGARA SUDHA BHARATHI** (New name) Henceforth Iam being called as **MUNGARA SUDHA BHARATHI** (New name) for all practical purposes.

రైతులకు ఎలుకల నిర్మూలన మందు అందజేత

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎలుకలు మనిషి కంటే తెలివైనవని, వాటిని నియంత్రించడానికి విషపు ఎర మాత్రమే ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. కోరుకొల్లు రైతు భరోసా కేంద్రంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన విషపు ఎర తయారీ, ఎలుకల స్వభావం, ఇతర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంతెన యోగేంద్రకుమార్ (బా బు), పాలకోడేరు వ్యవసాయ అధికారి వి.నారాయణరావు భీమ వరం ఎడిఎ సిహెచ్.శ్రీనివాస్, డిఆర్‌సిఎఒ బాలకోటేశ్వ రమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర : సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా రైతులకు బ్రోమోడయోలిన్ మందును ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎఒ ఎ.జ్యోషిల తెలిపారు. మండల పరిధిలోని 19 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు, కౌలు రైతులకు పంపిణీ చేశారు. మండలంలో 13,400 ఎకరాల్లో మందును రైతుల ద్వారా పెట్టించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : అన్నదాతలు సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టి అధిక దిగుబడి పొందాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గొల్లగూడెంలో అన్నదాతలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలన మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆ శాఖ అధికారి అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, కంచర్ల బాబు, పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు బ్రోమోడయోలిన్ మందును ఎఒ ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12,825 ఎకరాలకు 2,955 కేజీల ఎలుకలు మందును రైతులకు అందించారు.

ఉండి : మండల వ్యాప్తంగా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఉండి రైతు భరోసా కేంద్రంలో రైతులకు బ్రోమోడయోలిన్ మందు పొట్లాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య, సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిటిసి సభ్యులు రమాదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్తిలి : రైతు భరోసా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్ములన కార్యక్రమం విజయమైందని ఎఒ టికె.రాజేష్ అన్నారు. రైతులకు ఎలుకల మందు అందించినట్లు చెప్పారు. రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చర్యలు చేపడితే ఫలితాలు ఉంటాయని తెలిపారు.

'రాజకీయంగా ఎదుర్కోలేకే చంద్రబాబుపై కేసులు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అరెస్టుపై టిడిపి భీమవరం నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పిపి రోడ్డు పక్కన ప్రయివేట్ స్థలంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూ ర్తులు మంగళవారం ప్రారంభించారు. నిరాహార దీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులకు భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజ నేయులు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏజెంట్లు సంఘీభావం తెలిపారు. నందమూరి కుటుంబ బస్తుడు నందమూరి యశ్వంత్ రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించి నేనుసైతం బాబుకోసం వైట్ బోర్డుపై సంతకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి భీమవరం మండల అధ్యక్షుడు రేవు వెంకన్న, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, వీరవాసరం మండల ప్రధా న కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. చంద్రబాబును విడుదల చేయాలని పలువురు డిమాండ్ చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు జివి పాల్గొన్నారు.

ఆచంట : చంద్రబాబుపై కేవలం రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించడం దారుణమని టిడిపి నాయకులు పితాని వెంకట్ అన్నారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆచంటలో నియోజవర్గ స్థాయిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 14వ రోజు మంగళవారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, శ్రీరాములు, ప్రసాద్, మురళి, శ్రీనివాస్, మోహన్, ప్రభాకర్, సీతారాం పాల్గొన్నారు.

ఉండి : ఉండిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో నియోజకవర్గ యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు చెవిలో పువ్వు పెట్టుకుని అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన తెలిపారు. వారికి నందమూరి యశ్వంత్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు సంఘీభావం తెలిపారు. సాయంత్రం నియోజ కవర్గ సీనియర్ నాయకులు కాగిత మహంకాళి, గంధం ఉమా తెలుగు యువత నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లిలోని గొంతేరు కాలువలో దిగి టిడిపి నాయకులు నిరసనగా జల దీక్ష చేశారు. అనంతరం చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, రేవు పద్మారావు, పడవల వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహనా ర్యాలీ

భీమవరం రూరల్ : ఆరోగ్యకరమైన సమాజం కోసం మన వంతు కృషి చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీకాంతం అన్నారు. పౌష్టికాహార మహోత్సవంలో భాగంగా యనమదుర్రులో పౌష్టికాహా రంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహిం చారు. సూపర్‌వైజర్లు సరళ, అనిలా, టీచర్లు జివి.కనక దుర్గ, ప్రసన్న, సరస్వతి, మాణిక్యం పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 222-224/General/2023-24, Dated. 26-9-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Balance incomplete work at Ward Sachivalayam, Providing CC Road and Providing Plantation in Municipal Corporation, Eluru"** Total No. of works is **3** with an amount of Rs. **26.79** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 27-09-2023. Last date of receipt of tenders is 03-10-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
ఓ.యస్. నెం. 433/2022

బిట్వీన్:
జక్కంపూడి వెంకటేశ్వరరావు -వాది
మరియు
కవురు సుధాకర్ -ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

ప్రతివాది: కవురు సుధాకర్, తండ్రి: లేటు సత్యనారాయణ, డోర్ నెం. 22-71, ప్రకాశం రోడ్, అంబేద్కర్ కాలనీ, వేల్పూరు - 534222, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

పై నెంబరు దావా మీపై 2 ప్రాంశరీ నోట్ల ఆధారంగా మీ నుంచి **రూ. 3,35,260/-లు** వసూలు కావలెనని కోరుచూ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు మీకు దావా నందు సమన్లు ఆర్డరు వేయగా, మీరు కావాలని సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా నందు సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 03-10-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల సదరు దావా మీ పరోక్షము నందు తీర్మానం జరుగునని ఇందు మూలంగా తమకు తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.24-9-23 సెల్: 9390018122

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియరు సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. No. 13/2020

Between:
Canara (e-Syndicate) Bank, Tanuku Branch. Rep. by its Manager -వాది
మరియు
1. Sirra Pradeep Kumar, S/o. Babji Rao, Door No. 28-12-18, Sattiraju gari Street, Tanuku, A.P.
2. Bathu Venkateswara Rao -ప్రతివాద్లు

వాదికి ప్రతివాద్లు నుండి వసూలు కావలసియున్న బాకీ మొత్తము రూ. 53,779-15 పైసలు, దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు నిమిత్తము ప్రతివాద్లు పై దావా దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు దావా నందు 1వ ప్రతివాది హాజరు నిమిత్తము ది. 16-10-2023న వాయిదా అయి ఉన్నది. 1వ ప్రతివాది **ది. 16-10-2023వ తేదీన పైన తెల్పిన మహారాజశ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితు స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరయి తమ యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలెను. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా 1వ ప్రతివాది యొక్క పరోక్షము నందు తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది. యీ ప్రకటన ది. 14-09-2023వ తేదీ గల కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ప్రకటించడమైనది.

సి.యస్.వి.యస్.ఖుస్రీ
తణుకు వాది తరపు న్యాయవాది, తణుకు
ది.25-9-2023 సెల్: 9989567750

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
ఓ.యస్. నెం. 16/2021

బిట్వీన్:
నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి -వాది
మరియు
గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి, వగైరా -ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

1వ ప్రతివాది: గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి, తండ్రి: గంగిరెడ్డి, డోర్ నెం. 3-107, శివాలయం వీధి, మల్లిపూడి - 534 124, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

పై నెంబరు దావా మీ వగైరాలపై ది. 3-1-2018వ తేదీ ప్రాంశరీ నోటు ఆధారంగా రూ. 9,22,897/-లు వసూలు కావలెనని కోరుచూ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు మీకు దావా నందు సమన్లు ఆర్డరు వేయగా, మీరు కావాలని సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా నందు సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 05-10-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల సదరు దావా మీ పరోక్షము నందు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.24-9-23 సెల్: 9390018122

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన పశ్చిమగోదావరి జిల్లా, అత్తిలి మండలం, వరిఘేడు గ్రామం, డోర్ నెం. 4-32రు కాపురస్తులు చిలకమర్తి రత్తయ్య గారి కుమారుడు చిలకమర్తి రామకృష్ణ గారు నాకు ఇచ్చిన బోగట్టా ప్రకారం సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు శ్రీ చిలకమర్తి రామకృష్ణ, తండ్రి: (లేటు) రత్తయ్య గారికి వరిఘేడు గ్రామంలో బిల్డింగును డాక్యుమెంట్ నెం. 1803/2020 రు క్రియ దస్తావేజు రీత్యా పొందియుండెను. సదరు ఆస్తిని హామీగా పెట్టి తన గృహ అవసర రుణం కొకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి నందు రుణం తీసుకొనుచున్నాడు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ అయిన ఒరిజినల్ రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు నెం. 2257/2019 (తేది. 18-06-2019)ను జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్ళుచుండగా ఈ దస్తావేజు పెట్టిన కవరు పోయినది. నా క్లయింటు సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు పెట్టిన కవరు కోసం వెతికినారు. అయిననూ దొరకలేదు. వెరిటాస్ ఫైనాన్స్, భీమవరం బ్రాంచి నుంచి నా క్లయింటు రుణాన్ని పొందుచున్నారు. ఒరిజినల్ డాక్యుమెంటు పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా సేల్ డీడ్ 2257/2019 (ది. 18-06-2019) యొక్క సర్టిఫైడ్ కాపీ రుణ మొత్తానికి హామీగా సదరు బ్రాంచ్‌కి అవసరమైన డాక్యుమెంట్స్‌తో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలియపర్చిన నా క్లయింటు చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్ దొరికినవారు ఎవరైన వాటిని వినియోగించిన యెడల చట్టవిరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

బొక్కా చంద్రశేఖరరావు
అడ్వకేట్ & నోటరీ
తాలూకా ఆఫీసు ఎదురుగా, భీమవరం-534201
ప॥గో॥జిల్లా, సెల్: 9491172663

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు శ్రీ తోట శ్రీదుర్గ ప్రసాద్, తండ్రి: వెంకన్న గారికి తాడిపర్రు గ్రామంలో డాక్యుమెంట్ నెం. 1826/2009 శెటిల్‌మెంట్ దస్తావేజు పొందియుండెను. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్, తణుకు బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నాడు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజినల్ రిజిస్టరు వీలునామా దస్తావేజు నెం. 164/1995. ఈ లింకు ఒరిజినల్ దస్తావేజు (వీలునామా) జిరాక్స్ కాపీ తీసుకొనుటకు వెళ్ళుచుండగా ఈ దస్తావేజు కవరు తప్పిపోయినది. ఎంతో కాలముగా వెతికినా దొరకలేదు. వెరిటాస్ ఫైనాన్స్, తణుకు బ్రాంచి గారి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ ఒరిజినల్ రిజిస్టర్ వీలునామా పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా 164/1995 యొక్క సర్టిఫైడ్ కాపీ ఋణ మొత్తానికి హామీగా సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ రిజిస్టరు వీలునామా డాక్యుమెంట్ కనుగొన్న లేదా దొరికినా వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము. ఇంకను తెలియజేయునది ఏమనగా సదరు డాక్యుమెంట్ దొరికినవారు ఎవరైనా దానిని వినియోగించిన యెడల చట్టవిరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టపరమైన చర్య తీసుకొనబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎ.నాగేశ్వరరావు
అడ్వకేట్ & నోటరీ
తణుకు, సెల్: 91103 82946

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
ఐ.పి. నెం. 32/2019

బిట్వీన్:
గజ్జల వంశీ -పిటీషనర్/డెబిటర్
మరియు
దరావత్తు రంగారావు మరియు ఇతరులు -రెస్పాండెంట్లు/క్రెడిటర్స్

టూ:
రెస్పాండెంట్లు 14, 18, 20:
ఆర్-14: సిహెచ్.రామకృష్ణ, తండ్రి: నాట్ నౌన్, డోర్ నెం. 19-75, C/o. దివ్యసాయి మారుతీ మోటార్స్ ఫైర్‌స్టేషన్, హీరోషోరూం ఎదురుగా, చింతలపూడి, ఏలూరు జిల్లా.
ఆర్-18: జగన్నాధం మల్లేష్, తండ్రి: (నాట్ నౌన్), డోర్ నెం. 70-115, మశీదు రోడ్డు, ఎలుకుల బజార్, చింతలపూడి, ఏలూరు జిల్లా.
ఆర్-20: నాదా చుట్టమ్మ, భర్త: (నాట్ నౌన్), డోర్ నెం. 11-258, నియర్ యూ.పి.స్కూల్, ఎన్.టి.ఆర్. కాలనీ, చింతలపూడి, ఏలూరు జిల్లా.

పై పిటీషనరు దాఖలు చేసిన డెబిటర్ ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌లో రెస్పాండెంట్లు 14, 18 మరియు 20లకు నోటీసు నిమిత్తం ది. **13-10-2023వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు.** సదరు రెస్పాండెంట్లకు పై పిటీషన్ విషయమై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల **వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల వారి పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో)
ఆచంట వెంకటేశ్వరరావు
స్థలము: ఏలూరు అడ్వకేట్, ఏలూరు
తేది:26-09-2023 సెల్: 9440186699